
మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి : 01 సంచిక :36 | ఆదివారం , 05 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## నేటిమాట

అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉంటూ, నేను తటస్థంగా ఉన్నా అంటే అన్యాయానికి మద్దతు ఇస్తున్నట్లే.
-డెస్మండ్ టుటు
(వర్ణవివక్షకు వ్యతిరేకంగా హక్కులకోసం పోరాడిన దక్షిణాఫ్రికా యోధుడు)



# భూమి లేకపోయిన రైతు భరోసా





- తెలంగాణ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికి రైతు భరోసా
- ప్రతి ఎకరానికీ ఏటా రూ.12 వేలు
- భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్
- ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు
- ఫిబ్రవరి నుంచి సన్నబియ్యం పంపిణీ
- కేబినెట్ నిర్ణయంతో ప్రజల్లో నిరాశ
- ఎన్నికలలో రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ.. ఇప్పుడేమో రూ.12 వేలు
- ప్రభుత్వ పెద్దలంతా సంక్రాంతి కానుకలు ఇస్తామని ఉదరగొట్టారు
- కేవలం మూడు పథకాల మీదనే నిర్ణయాలు
- అవి కూడా జనవరి 26కు అమలు చేస్తామని చెప్పటం
- రైతు భరోసాలో కోత పెట్టటం
- సంక్రాంతి నుంచి సన్నబియ్యం ఇస్తామని చెప్పి.. . కనీసం చర్చించకపోవటం
- ఇందిరమ్మ ఇండ్ల గురించి కూడా ఎలాంటి ప్రస్తావన లేకపోవటం

తెలంగాణ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. స్వయంగా సీఎం రేవంత్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికి రైతు భరోసా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రతి ఎకరానికీ ఏటా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. వీటితో పాటు భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్ కింద ఏటా రూ.12 వేలు సాయం అందించేందుకు కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని సీఎం వెల్లడించారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు పంపిణీ జరగనుంది. ఇక ఫిబ్రవరి నుంచి సన్నబియ్యం పంపిణీ జరగనుంది.

**హైదరాబాద్ ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ):**

తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు ఆర్థిక సాయం, కొత్త రేషన్ కార్డుల జారీపై కేబినెట్ ఆమోదం తెలిపిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మూడు పథకాలు కూడా జనవరి 26 నుంచి అమలు చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే.. మూడు పథకాలు ప్రకటించినప్పటికీ తెలంగాణ ప్రజల్లో నిరాశ వ్యక్తమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ ట్రిబుల్ ధమాకా ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. రైతు భరోసా, రైతు కూలీలకు ఆర్థిక సాయంతో పాటు కొత్త రేషన్ కార్డుల జారీ అంశాలపై చర్చించిన కేబినెట్.. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ భేటీ అనంతరం.. నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు.


రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్టు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఒక్క ఎకరానికి రైతు భరోసా కింద రూ.12 వేలు ఇవ్వనున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అయితే.. ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు, వెసులుబాటు దృష్ట్యా రైతు భరోసా కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.10 నుంచి రూ.12 వేలకు పెంచుకున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే.. గత ప్రభుత్వంలో రైతు బంధు ఇచ్చిన భూముల్లో.. రియల్ ఎస్టేట్‌గా మారిన స్థలాలు, గుట్టలు, రోడ్లకు రైతు భరోసా ఇచ్చేది లేదని రేవంత్ రెడ్డి తేల్చేశారు. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు.

మరోవైపు.. భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.12 వేల సాయం అందించనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ రెండు పథకాలతో పాటు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీకి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మూడు పథకాలు కూడా జనవరి 26 నుంచి అమల్లోకి వస్తాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

2 లో

## సీఎం అంటే ఇప్పుడు కటింగ్ మాస్టర్

- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు
- పర్రె మేడిగడ్డకు పడలేదు.. రేవంత్ పుర్రెకు పడ్డదని
- కేసులకు భయపడకండి.. చిట్టినాయుడు ఏం పీకలేదు
- కాంగ్రెస్ 8, బీజేపీ 8 ఎంపీలు - తెచ్చింది మాత్రం గుండు సున్నా
- ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తే.. ఆరు కేసుల్లో ఇరికిస్తున్నారు
- రెండు లక్షల రుణమాఫీ వందశాతం అమలైతే రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్‌కు పరిపాలన చేతకావడం లేదు
- చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి
- రైతు ప్రమాణపత్రం కేసీఆర్ హయాంలో అడుగలేదు
- కేసీఆర్ దేశాన్ని శాసించే రోజులు మళ్లీ వస్తాయి



**హైదరాబాద్,04 జనవరి ( క్రాంతి న్యూస్ ):** సీఎం అంటే ఇప్పుడు కటింగ్ మాస్టర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పర్రె మేడిగడ్డకు పడలేదు.. రేవంత్ పుర్రెకు పడ్డదని ఎద్దేవా చేశారు.

2 లో



2 లో

## రూ. 700 కోట్ల ల్యాండ్ స్కాం

అడ్డంగా బుక్ అయిన రీతూ చౌదరి



2 లో

## కేటీఆర్ విచారణకు హాజరవుతారా..?

- కేటీఆర్‌కు సమన్లు జారీ చేసిన ఏసీబీ, ఈడీ
- 6న హాజరు కావాలంటూ ఏసీబీ, 7న విచారణకు రావాలని ఈడీ నోటీసులు
- క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు
- ప్రాథమిక విచారణ జరపకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం - కేటీఆర్
- కేసు వెనుక రాజకీయ కక్షసాధింపు
- 2న ఐఏఎస్ అధికారి అరవింద్, జనవరి 3న హెచ్ ఎండిఏ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డి గైర్హాజరు

## తెలంగాణలో షేక్ హ్యాండ్స్ వద్దు

### రేవంత్ సర్కార్ హైఅలర్ట్



2 లో

చైనాలో మెటాన్యుమోవైరస్( HMPV) శరవేగంగా విస్తోరిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా శరవేగంగా నిర్ణయాలను తీసుకుంది.

ఈ మేరకు తెలంగాణ ప్రజారోగ్యం-కటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ రవీందర్ నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క హెచ్ఎంపీవీ కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. దీని బారిన పడకుండా ఉండటానికి పలు సూచనలు ఇచ్చారు.

## చర్లపల్లి టెర్మినల్ 6న ప్రారంభం

ఎట్టకేలకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు అయ్యింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం (జనవరి 6 వ తేదీన) వర్చువల్ గా ప్రారంభించనున్నారు. దాదాపు వంద ఏళ్ళ తరవాత భాగ్యనగరం లో మరో రైల్వేస్టేషన్ అందుబాటులోకి వచ్చింది.



3లో




2లో

### చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ప్రజెంటేషన్ పై రేవంత్ అభ్యంతరం




3లో

### కంప్లైంట్ చేయాలంటే ఈ నెంబర్లకు కాల్ చేయండి - 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్




3లో

### మరో ఘోరం - బాలికల హాస్టల్ బాత్రూంలో కెమెరాల కలకలం



### యాదాద్రి జిల్లాలో విషాదం

3లో



3లో

### విదేశాల్లో ఉన్న అల్లుడిపై కేసు నమోదు చేసేలా ఆదేశించండి..

హైకోర్టులో 84 ఏండ్ల వృద్ధుడు పిటిషన్

# భూమి లేకపోయిన రైతు భరోసా

మొదటి పేజీ తరువాయి

## ప్రజల్లో నిరాశ

హైదరాబాద్ ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): అయితే.. తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ మూడు పథకాల అమలుకు ముహూర్తం ప్రకటించినా.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ట్విస్ట్‌తో ప్రజల్లో నిరాశ ఎదురయ్యే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో.. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇవ్వగా.. ఏడాది తర్వాత ప్రకటిస్తూ రూ.12 వేలు అని ప్రకటించటం రైతులకు తీవ్ర నిరాశ కలిగించే అవకాశం లేకపోలేదు. దానికి.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన ఆర్థిక పరిస్థితులు అనే సమాధానం కూడా దాటవేసే ధోరణిలాగే కనిపించటం కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది.

అంతేకాకుండా.. గత కొంతకాలంగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలంతా సంక్రాంతి కానుకలు వస్తున్నాయంటూ ప్రతి సందర్భంలో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లాంటి కీలక హామీల గురించి ప్రస్తావిస్తూ వస్తున్నారు. అయితే.. కేబినెట్ భేటీ తర్వాత పండగలాంటి నిర్ణయాలు వస్తాయని అందరూ ఆశించగా.. కేవలం మూడు పథకాల మీదనే నిర్ణయాలు తీసుకోవటం, అవి కూడా జనవరి 26కు అమలు చేస్తామని చెప్పటం, అందులోనూ రైతు భరోసాలో కోత పెట్టటం ప్రజలను నిరాశకు గురిచేసే అవకాశం లేకపోలేదు.

మొత్తంగా.. కొత్త రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పక్కన పెడితే.. ఎప్పుడెప్పుడా అని తెలంగాణ రైతులంతా ఎదురుచూసిన రైతు భరోసా పథకం మాత్రం కచ్చితంగా అన్నదాతలను నిరాశపర్చే అవకాశం ఉంది. సంక్రాంతి నుంచి సన్నబియ్యం ఇస్తామని పదే పదే చెప్తున్న ప్రభుత్వం భేటీలో కనీసం చర్చించకపోవటం గమనార్హం. ఇక ఇందిరమ్మ ఇండ్ల గురించి కూడా ఎలాంటి ప్రస్తావన లేకపోవటం పేదలను నిరాశపర్చటమే..!

### ఇతర కేబినెట్ నిర్ణయాలు:

పంచాయతీరాజ్‌లో 508 కారుణ్య నియామకాలు
కొత్త గ్రామ పంచాయతీలకు కేబినెట్ ఆమోదం
-పాలమూరు %-% రంగారెడ్డి ఎత్తిపోతలకు జైపాల్ రెడ్డి పేరు
-పాలమూరు ప్రాజెక్టు ప్యాకేజీ-2 వ్యయం రూ.1,784 కోట్లకు పెంపు
-పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌లో 588 కారణ్య నియామకాలకు ఆమోదం
-56 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో వీలినానికి గ్రీన్‌సిగ్నల్
-టూరిజం, క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ, సాగునీటి సంఘాల పునరుద్ధరణ

# రూ. 700 కోట్ల ల్యాండ్ స్కాం

## అడ్డంగా బుక్ అయిన రీతూ చౌదరి



జబర్దస్త్ ద్వారా పాపులర్ అయినా భామల్లో క్రేజీ బ్యూటీ రీతూ చౌదరి ఒకరు. ఈ చిన్నది తన కామెడీతో పాటు అందంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు ఈ బ్యూటీ అనుకోని చిక్కుల్లో ఇరుక్కుందని తెలుస్తుంది . ఏకంగా రూ. 700 కోట్ల ల్యాండ్ స్కాం లో ఆమె అడ్డంగా బుక్ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సంచలనం సృష్టిస్తోంది. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ల్యాండ్ మాఫియాలో రీతూ చౌదరికి పేరు బయటకు వచ్చిందని టాక్ వినిపిస్తుంది. విజయవాడ, ఇబ్రహీంపట్నంకు సంబంధించిన ల్యాండ్ రిజిస్ట్రేషన్‌లో ఆమె అడ్డంగా బుక్కయ్యారని అంటున్నారు.

రీతూ చౌదరి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటుంది. జబర్దస్త్ కామెడీ షో ద్వారా తనదైన కామెడీతో మంచి పేరును సంపాదించుకుంది. అంతేకాదు అతి తక్కువ సమయంలోనే మంచి పేరు సంపాదించుకున్న రీతు చౌదరి కొన్ని వెబ్ సిరీస్ లలో కూడా నటించింది. అయితే ప్రస్తుతం ఆమె ల్యాండ్ స్కామ్‌లో అడ్డంగా బుక్ అయినట్లు తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్, ఇబ్రహీంపట్నం కు చెందిన రూ.700 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించి స్కామ్‌లో రీతూ చౌదరి పేరు కూడా బయటకు వచ్చింది. ఇందులో పలువురు పెద్ద తలకాయలు కూడా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మాజీ సీఎం వైఎస్‌జగన్ సోదరుడు వైఎస్ సునీల్, జగన్ పిఏ నాగేశ్వర్ రెడ్డి పేర్లు కూడా బయటకు వచ్చాయి. ఇందులో నటి రీతూ చౌదరి, చీమకుర్తి శ్రీకాంత్‌పై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీతు చౌదరి శ్రీకాంత్ కు రెండో భార్య.

కిడ్నాప్ చేసి గోవాలో బంధించి బలవంతంగా రూ. 700 కోట్ల ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు సబ్ రిజిస్టర్ ధర్మ సింగ్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారని తెలుస్తుంది. అయితే కేసు కూడా నమోదు అయినట్లు సమాచారం. ఈ విషయంపై ఏపీ ప్రభుత్వం సీరియస్ గా ఉందని అంటున్నారు. ఇక రీతూ చౌదరి అసలు పేరు వనం దివ్య. అసలు ఈ విషయంపై రీతూ అధికారికంగా రియాక్ట్ అయ్యే వరకు క్లారిటీ రావాల్సి ఉంది.. నిజా నిజాలు ఏంటో రీతూ చౌదరి ఎప్పుడు బయట పెడుతుంది అనే ఆసక్తి రేకెత్తిస్తుంది. ఇదిలా ఉంటే రీతూ భర్త శ్రీకాంత్ క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు అని అన్నారు. మొదటి నుంచి నా ఫ్యామిలీ టాక్స్ కరెక్ట్ గా పే చేస్తున్నాం.. రీతూ చౌదరి పేరు మీద ఉన్న ఆస్తులన్నీ పూర్తిగా నాకు చెందినవి, మేము సంపాదించుకున్నవి అని అన్నారు. అలాగే నేను ఎవరికీ బినామీని కాదు. నాపై వస్తున్న ఆరోపణలు అన్ని అవాస్తవం అని అన్నారు శ్రీకాంత్.



# సీఎం అంటే ఇప్పుడు కటింగ్ మాస్టర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): చిల్లర మల్లర రాతలు రాయించేవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. బాక్సింగ్‌లో కిందపడ్డా నిలబడి కొట్లాడేటోడే వీరుడు అని చెప్పారు. కాంగ్రెస్ 8, బీజేపీ 8 ఎంపీలు అయ్యారని కానీ కేంద్రం నుంచి వచ్చింది మాత్రం గుండు సున్నా అని విమర్శించారు.

చిన్న చిన్న తప్పిదాలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఒక రోజు దేశంలో చక్రం తిప్పే రోజు ముందుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వానికి రూ.369 కోట్ల రెవెన్యూ మిగులుతో అప్పజెప్పితే.. మనం దిగిపోయేనాడు రూ. 5 వేల 564 కోట్ల మిగులుతో కాంగ్రెస్‌కు అప్పజెప్పామని తెలిపారు. రెవెన్యూ మిగులు విషయంలో ముఖ్యమంత్రిదో మాట.. ఉప ముఖ్యమంత్రిదో మాట ఉందని విమర్శించారు.

పదేళ్లలో రూ. 4 లక్షల 17 వేల కోట్లు మనం అప్పు చేస్తే.. కాంగ్రెస్ ఒక ఏడాదిలో రూ. 1 లక్షా 37 వేల కోట్ల అప్పు చేసిందని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల జరిగిన అభివృద్ధి గురించి మేం చెప్తాం.. మీ అప్పులతో ఏం జరిగిందో మీరు చెప్పగలరా అని నిలదీశారు. ఈ ప్రభుత్వం హైడ్రా పేరిట పేదల పొట్ట కొట్టడం తప్ప ఏం చేసిందని ప్రశ్నించారు. పైసలన్నీ ఢిల్లీకి పంపుతున్నారని అన్నారు. ఢిల్లీకి తెలంగాణ ఏటీఎం అయిపోయిందని విమర్శించారు. కోటి ఆరు లక్షల మంది నుంచి దరఖాస్తులు తీసుకుని ఏం చేసినట్టు? మళ్ళీ ఈ రైతు ప్రమాణ పత్రాలెందుకు అని ప్రశ్నించారు.

ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తుంటే.. తననను ఆరు కేసుల్లో ఎలా ఇరికిద్దామా అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కేటీఆర్ విమర్శించారు. కొడంగల్ భూములివ్వని కేసులో కూడా తనను ఇరికించే యత్నం చేశారని తెలిపారు. ఆయన కేసుల గురించి ఆలోచిస్తుంటే.. మనం రైతుల గురించి ఆలోచిద్దామని తెలిపారు. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించి, బూత్ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీలు వేసుకుందామని తెలిపారు. రైతు భరోసాపై గ్రామాల్లో నాయకులంతా చర్చ పెట్టాలని సూచించారు.

## మేడిగడ్డకు కాదు.. రేవంత్‌రెడ్డి బుర్రకి పర్రె పడ్డది..!

పర్రెపడ్డదని మేడిగడ్డ బరాజ్ కాదని.. రేవంత్‌రెడ్డి బుర్రకని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు సెటైర్లు వేశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ మాత్రమే అమలైందన్నారు. రెండు లక్షల రుణమాఫీ.. వందశాతం అమలైతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పానన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన చేతకావడం లేదని.. చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి అంటూ విమర్శించారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రెగ్యులేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని.. వారికి కల్యాణలక్ష్మి ఇవ్వలేదన్నారు. రూ.7500 రైతుబంధు కాదుకదా.. 75 పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు ప్రమాణపత్రం కేసీఆర్ హయాంలో అడుగలేదని.. రైతుబంధు ఇచ్చామన్నారు. 12 దఫాల్లో రూ.80వేలకోట్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు జమైందని వివరించారు. రైతులని బద్నాం చేసు కుట్ర జరుగుతుందని.. రైతులను దొంగల్లా చిత్రీకరించే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం, ఐటీ ఉంటే రైతుబంధు కట్ అంటున్నాడని.. సీఎం రేవంత్ కట్టింగ్ సీఎం అయ్యారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేశారని.. మేడగడ్డకు పర్రెపడడం కాదు.. రేవంత్‌రెడ్డి బుర్రకి పర్రె పడ్డదని విమర్శించారు.

కోటిన్నర ఎకరాలకి నీళ్లు ఇవ్వాల్సి వస్తుంది కాబట్టే కాళేశ్వరాన్ని బాగు చేయడం లేదని ఆరోపించారు. ప్రేక్షక పాత్ర కాదు అన్యాయం జరిగితే కొట్లాడాలని పిలుపునిచ్చారు. చిట్టినాయుడు ఏం పీకలేడన్నారు. అతివిశ్వాసం.. చిన్నచిన్న తప్పిదాలతో అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయామని.. కేసీఆర్ దేశాన్ని శాసించే రోజులు మళ్లీ వస్తాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా.. కేసీఆర్ జపం చేస్తున్నారన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని సీఎం చెబుతున్నాడని.. పరిపాలన చేతకాక మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# కేటీఆర్ విచారణకు హాజరవుతారా..?

మొదటి పేజీ తరువాయి

కమ్ముకొస్తున్న ఈ-రేసు కేసు.. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎటూ కదలనివ్వకుండా చెక్ పెట్టేస్తోంది. ఒకవైపు నుంచి ఏసీబీ.. మరోవైపు నుంచి ఈడీ తరుముకొస్తున్నాయి. అరెస్టుకు అరడుగు దూరంలో నిలబడ్డారా అనే సందేహాల నడుమ మొన్న క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు కాస్త రిలీఫ్ ఇవ్వగా తాజాగా విచారణకు రావాలంటూ ఏసీబీ నోటీసులివ్వడం హాట్‌టాపిక్‌గా మారింది. ఆ మర్నాడే ఈడీ విచారణ ఉండనే ఉంది. దీంతో ఇప్పుడందరి చూపు ఫార్ములా ఈ-రేస్ కేసు వైపే. మరి కేటీఆర్ విచారణకు హాజరవుతారా ? ఆయన లీగల్ టీమ్ ఏమంటోంది ? అన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఏసీబీ, ఈడీ దూకుడు పెంచింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. జనవరి 6వ తేదీన హాజరు కావాలంటూ ఏసీబీ, జనవరి 7వ తేదీన విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఆదేశించింది. ఈ కేసులో సహ నిందితులుగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్విందకుమార్, హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా సమన్లు జారీ చేసింది.

తెలంగాణలో ఫార్ములా ఈ-రేస్ కేసు సెన్సేషన్ క్రియేట్ చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చుట్టూ ఎంక్వైరీలు మోహరిస్తున్నాయి. ఓవైపు ఏసీబీ.. మరోవైపు ఈడీ దూకుడుమీదున్నాయి. విచారణ గడువులు దూసుకొస్తున్నాయి. ఒక్కరోజు వ్యవధిలోనే ఏసీబీ, ఈడీ విచారణకు రావాలంటూ నోటీసులివ్వడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కేసులతో కేటీఆర్ ఫ్యూచర్‌పై సస్పెన్స్ కొనసాగుతుండటం చర్చనీయాంశమైంది.

తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై మొన్ననే వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసింది తెలంగాణ హైకోర్టు. ఇంతలోనే కేటీఆర్‌ను ఏ1గా చేర్చిన ఏసీబీ విచారణకు రావాలంటూ లేటెస్ట్‌గా నోటీసులివ్వడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈనెల ఆరో తేదీన ఉదయం 10 గంటలకు విచారణకు రావాలంటూ నోటీసుల్లో పేర్కొంది.

ప్రాథమిక విచారణ జరపకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్న కేటీఆర్ వాదన కూడా అర్థరహితమంటోంది ఏసీబీ. ఫార్ములా-ఈ కేసు వెనుక రాజకీయ కక్షసాధింపులున్నాయన్న ఆరోపణల్ని కూడా కొట్టిపారేస్తోంది. అటు.. కేటీఆర్‌పై ఫిర్యాదు చేసిన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నుంచి వాంగ్మూలం తీసుకుని సిద్ధంగా ఉంచుకుంది ఏసీబీ. విచారణకు సంబంధించిన క్వశ్చనరీని సిద్ధం చేస్తోంది.

ఇటు ఈడీ కూడా కాచుకు కూర్చింది. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ని ఆధారంగా చేసుకుని.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేటీఆర్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. ఈనెల 7న అంటే%ా% ఏసీబీ విచారణకు పిలిచిన తర్వాత రోజే ఈడీ విచారణకు కేటీఆర్ హాజరుకావాల్సి ఉంటుంది. మరోవైపు ఇదే కేసులో జనవరి 2న ఐఏఎస్ అధికారి అరవింద్, జనవరి 3న హెచ్ ఎండిఏ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డి ఈడీ విచారణకు హాజరవ్వాల్సి ఉంది. అయితే ఈడీ విచారణకు వారు గైర్హాజరయ్యారు. గడువు కావాలని కోరారు. దీంతో కేటీఆర్ విచారణ మర్నాడు బీఎల్ఎన్ రెడ్డిని, ఆ తర్వాతి రోజు అర్వింద్‌కుమార్‌ను విచారించనున్నారు ఈడీ అధికారులు.

మొత్తంగా ఓవైపు ఏసీబీ విచారణ ఇలా స్పీడందుకోగానే.. ఈడీ కూడా సిద్ధమంటోంది. జనవరి 6న ఏసీబీ విచారణకు.. ఆ తర్వాతి రోజున ఈడీ విచారణకు కేటీఆర్ హాజరుకావాల్సి ఉంది. మరి కేటీఆర్ విచారణకు హాజరవుతారా ? లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే అసలు కేసునే కొట్టివేయాలని క్వాష్ పిటిషన్ వేసిన నేపథ్యంలో ఆ రిజల్ట్ వచ్చాకే విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్ లీగల్ టీమ్ చెబుతున్నట్లు పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో..!

# చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ప్రజెంటేషన్ పై రేవంత్ అభ్యంతరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మిస్తున్న, నిర్మించతలపెట్టిన నీటి ప్రాజెక్టులపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో వచ్చిన వరదల వల్ల భద్రాచలం ముంపునకు గురైందని, 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అధికారులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోందని.. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందన్నారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ సీఎస్‌కు తెలపాలని, అవసరమైతే గోదావరి బోర్డ్, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### యాదగిరిగుట్ట మహా కుంభాభిషేకానికి సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

యాదగిరిగుట్ట శ్రీ శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహా స్వామి వారి దివ్య స్వర్ణ విమాన గోపుర మహా కుంభాభిషేక మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు యాదగిరిగుట్టలో దివ్య విమాన స్వర్ణ గోపుర మహా కుంభాభిషేక కార్యక్రమం జరగనుంది.

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు యాదగిరిగుట్ట ఆలయ ఈవో, అర్చకులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు ఆహ్వానాన్ని అందజేశారు.

విలేకరులు కావలెను..

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?

నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?

మన క్రాంతి తెలుగు దిన పత్రికలో

పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు,

యాడ్ ఎగ్జిక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.

కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com

ఈమెయిల్: krtv.md@gmail.com

# తెలంగాణలో షేక్ హ్యాండ్స్ వద్దు

మొదటి పేజీ తరువాయి

## రేవంత్ సర్కార్ హైఅలర్ట్

హెచ్‌ఎంపీవీ మరో రెస్పిరేటరీ వైరస్ అని, చలికాలంలో జలుబు, ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ప్రత్యేకించి- చిన్నపిల్లలు, వయోధిక వృద్ధులు దీని బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని కోరారు. చేయాల్సినవి- చేయకూడని వివరాలను ఈ ప్రకటనలో పొందుపరిచారు.

### చేయాల్సినవి..

1. దగ్గు, తుమ్ముతున్నప్పుడు నోటికి లేదా ముక్కుకు హ్యాండ్ కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్‌ను అడ్డు పెట్టుకోవాలి.
2. సబ్బు లేదా అల్కహాల్‌తో కూడిన శానిటైజర్‌తో తరచూ చేతులను శుభ్రపర్చుకోవాలి.
3. గుంపుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదు. అలాంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి.
4. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదు. గుంపులో తిరగకూడదు.
5. చాలినంత మంచినీళ్లు తీసుకోవాలి. పౌష్టికాహారాన్ని స్వీకరించాలి.
6. అనారోగ్యం బారిన పడినప్పుడు ఇతరులను కలుసుకోవడాన్ని తగ్గించాలి. ఇంట్లోనే ఉండాలి.
7. గాలి ధారాళంగా వచ్చేలా చేసుకోవాలి.
8. కంటి నిండా నిద్రపోవాలి.

### చేయకూడనివి..

1. ఇతరులకు షేక్ హ్యాండ్స్ ఇవ్వకూడదు.
2. ఒకసారి వినియోగించిన టిష్యూ పేపర్లు, హ్యాండ్ కర్చీఫ్‌ను మళ్లీ వాడకూడదు.
3. అనారోగ్యంతో బాధపడుతున్న వారితో దూరంగా ఉండాలి.
4. తరచూ కంటిని నలుపుకోవడం, ముక్కు, నోటిని చేత్తో తుడుచుకోవడాన్ని మానుకోవాలి.
5. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదు.
6. డాక్టర్‌ను సంప్రదించకుండా సొంతంగా ఎలాంటి మెడిసిన్‌నూ వాడకూడదు.



# తెలంగాణ

## కంప్లైంట్ చేయాలంటే ఈ నెంబర్లకు కాల్ చేయండి

**- 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్**

**ఫోన్ నెంబర్లు - 040 - 29565758, 040 - 29560596**

'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి సోమవారం నగర ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించాలని నిర్ణయించారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, తిరిగి 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఫిర్యాదు చేసే ముందు తగిన ఆధారాలు, పూర్తి వివరాలతో రావాలని సూచించారు. దీనికి సంబంధించి ఏమైనా సందేహాలుంటే 040 - 29565758, 040 - 29560596 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

### అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నెర్ర

అటు, హైదరాబాద్ మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోకుండా ఇక్కడ 100 అడుగుల రోడ్డును ఆనుకొని 5 అంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారంటూ హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అక్కడకు వెళ్లి పరిశీలించగా.. 684 గజాల స్థలంలో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల్లో భవనం నిర్మాణంలో ఉంది. జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులతో పాటు హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించడాన్ని రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. పూర్తి వివరాలు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### హైడ్రా వార్షిక నివేదిక హైలైట్స్ ఇవే..

కాగా, ఇటీవలే హైడ్రా వార్షిక నివేదికను రంగనాథ్ విడుదల చేశారు. 5 నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు రంగనాథ్ తెలిపారు. జీహెచ్ఎంసీ చట్టం కింద ప్రభుత్వం హైడ్రాకు ప్రత్యేక అధికారాలు ఇచ్చిందని.. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా రక్షించినట్లు చెప్పారు. 1,095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తామని.. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్ జోన్లను నిర్ణయిస్తున్నామని పేర్కొన్నారు.


### 'త్వరలోనే ఎఫ్‌ఎం ఛానల్'

ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం తమ బాధ్యతని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఎన్ఆర్ఎస్ఈతో సమన్వయం చేసుకుని శాటిలైట్ చిత్రాలు సేకరిస్తున్నామని.. ఏరియల్ డ్రోన్ చిత్రాలు సైతం తీసుకుంటామని చెప్పారు. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నామని.. ప్రభుత్వ భూములకు జియో ఫెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. చెరువులకు సంబంధించి 2000 నుంచి 2024 వరకూ ఉన్న చిత్రాలు సేకరిస్తున్నామన్నారు.

శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుందని రంగనాథ్ పేర్కొన్నారు. ఇప్పటివరకూ హైడ్రాకు 5,800 వరకూ ఫిర్యాదులు అందాయని.. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు కాపాడడమే హైడ్రా ప్రధాన కర్తవ్యమని.. భూముల రక్షణతో పాటు వరద నివారణ చర్యలు సైతం చేపడతామని అన్నారు. హైడ్రా తరఫున ఒక ఎఫ్ఎం ఛానల్ త్వరలోనే పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నామని.. దాని ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలిపేందుకు వీలుంటుందని అభిప్రాయపడ్డారు. హైడ్రా యాప్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

## చర్లపల్లి టెర్మినల్ 6న ప్రారంభం

మొదటి పేజీ తరువాయి



నగరంలో రోజురోజుకూ పెరుగుతున్నరద్దీ,అవసరాలను తీర్చడానికి,సిటీ శివారు లో చర్లపల్లి రైల్వేస్టేషన్ ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు రైల్వే అధికారులు. 430 కోట్ల రూపాయల తో విశాలంగా, ఆధునిక మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేశారు.పూర్తి గా ఎయిర్ పోర్ట్ తరాల లుక్ తో ఈ సోమవారం నుండి ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతుంది కొత్త టెర్మినల్.

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు ట్రాఫిక్ భారం తగ్గనుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి లో ఇప్పుడు 25 జతల రైళ్లు ఆగుతుండగా.. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళు రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. డిల్లి,మద్రాస్, కొలకత్తా,వైజాగ్ వైపు వెళ్లె ట్రైన్ లు చర్ల పల్లి నుండి నడవనున్నాయి.ఇక ఈ కొత్త టెర్మినల్ రాక తో సికింద్రబాద్,నాంపల్లి,కాచిగూడ స్టేషన్ ల పై ఒత్తిడి తగ్గనుంది. ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి మొత్తం 9 ప్లాట్‌ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు వంటివి సిద్ధం చేశారు. ఇది ప్రారంభమైతే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ప్రయాణికుల భారం తగ్గనుంది.

### ఇవీ ప్రత్యేకతలు..

ఇక్కడ ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి 9 ప్లాట్‌ఫాంలు, 2 ఫుట్ఓవర్ బ్రిడ్జిలు, 6 ఎస్కలేటర్లు నిర్మించారు.

### రైళ్ల వివరాలు..

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైన తర్వాత 50 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. ప్రతిరోజూ దాదాపు 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చర్లపల్లి 26 రైళ్లు ఆగుతున్నాయి. వాటిల్లో ముఖ్యంగా కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, పుష్-పుల్, శబరి ఎక్స్‌ప్రెస్, శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, రేపల్లె ప్యాసింజర్, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రైళ్లు ఉన్నాయి.

### భారం తగ్గుతుంది..

చర్లపల్లి నుంచి రైళ్ల రాకపోకలతో హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై భారం తగ్గనుంది. అయితే.. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం అయిన తర్వాత స్టేషన్‌కు చేరుకునే మార్గంలో.. రోడ్ల విస్తరణ చేపట్టి ప్రజారవాణాను మెరుగుపరచాలనే డిమాండ్ ఉంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపితే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది.

హైదరాబాద్‌కు తూర్పున చర్లపల్లి టెర్మినల్‌ను నిర్మించారు. దీనికి దగ్గర్లోనే ఘట్‌కేసర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఉంది. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్లపల్లి టెర్మినల్‌కు చేరుకునే అవకాశం ఉందని.. అధికారులు చెబుతున్నారు. ప్రైవేట్, ప్రజా రవాణా వాహనాలు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. చర్లపల్లి రైల్వే స్టేషన్ పనులు పూర్తైన నేపథ్యంలో రైల్వే బోర్డు పలు అనుమతులు ఇచ్చిందని తెలుస్తోంది. చర్లపల్లి స్టేషన్ నుంచి 6 ఎక్స్ ప్రెస్ రైళ్లను నడిపేందుకు అనుమతి వచ్చిందని సమాచారం.

మరో 12 రైళ్లు ఈ స్టేషన్‌లో ఆపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. షాలిమార్ - హైదరాబాద్ ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ - సికింద్రాబాద్ - గోరఖ్ పూర్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్‌లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

**మరో ఘోరం - బాలికల హాస్టల్ బాత్రూంలో**

## కెమెరాల కలకలం

**అసలు తెలంగాణలో ఎం జరుగుతుంది? మొన్నటికి మొన్న వరుసగా గురుకులాలో ఫుడ్ పాయిసన్ లు, పాము కాటులు, ఎలకలు, విద్యార్థుల మృతి. నిన్న పోలీసుల వరుస ఆత్మహత్యలు నేడు విద్యార్థినుల బాత్రూమ్ లో కెమెరాలు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? పోలీసు వ్యవస్థ పనిచేస్తుందా? లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతింది. రాష్ట్రానికి హెూం మినిస్టర్ లేకపోవడం వల్ల ఆ శాఖ పనితీరుపై సమీక్ష చేసే వారే లేరు. సిఎం దగ్గరే హెూం శాఖ ఉన్నా.. గత ఏడాది కాలంగా హెూం శాఖపై ఏనాడూ కూడా సమీక్ష చేయలేదు.**

అసలు విషయానికి వస్తే తెలంగాణలో మరో ఘోరం వెలుగుచూసింది. ఇటీవలే సీఎంఆర్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ ఘటన మరువక ముందే మరో ఘటన కలకలం రేపింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలోని గర్ల్స్ హాస్టల్ వద్ద వీడియోల రికార్డింగ్ కలకలం రేపింది. హాస్టల్ బాత్రూం వద్ద ఓ యువకుడు వీడియో రికార్డింగ్ చేసినట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. వాష్ రూం వద్ద మొబైల్‌లో కెమెరా ఆన్‌లో ఉంచి రికార్డ్ చేసినట్లు చెబుతున్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హాస్టల్ ముందు ఆందోళనకు దిగారు. ఏబీవీపీ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థినులు నిరసన తెలపగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా.. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బ్యాక్‌లాగ్ పరీక్ష రాసేందుకు వచ్చి సదరు విద్యార్థి ఇలా చేసినట్లు తెలుస్తోంది.




కాగా, ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదని.. ఇంతకు ముందు కూడా ఒకసారి ఇలా జరిగిందని చెబుతున్నారు. తొలిసారి ఇలా జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. ఇప్పుడైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే, రాష్ట్రంలో వరుస ఘటనలతో హాస్టల్ విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా కొందరు ఆకతాయిల్లో మార్పు రావడం లేదు. తమకు రక్షణ కల్పించాలని.. ఇలాంటి ఘటనల పట్ల కఠినంగా వ్యవహరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

### సీఎంఆర్ కాలేజీ ఘటన..

కాగా, ఇటీవలే హైదరాబాద్ శివారు మేడ్చల్ వద్ద సీఎంఆర్ఐటీ గర్ల్స్ హాస్టల్ వద్ద కూడా వీడియోలు తీశారని విద్యార్థినులు ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ ఆవరణలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేయగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హాస్టల్ వద్దకు చేరుకున్న పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దర్యాప్తు ముమ్మరం చేశారు. హాస్టల్ వార్డెన్ సహా ఏడుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరి వేలిముద్రలు సేకరించి.. 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అటు, ఈ ఘటనలో కళాశాల యాజమాన్యం 3 రోజులు సెలవులు ప్రకటించింది. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా ఘటనతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.





## యాదాద్రి జిల్లాలో విషాదం,

### కంపెనీలో భారీ పేలుడుతో ఒకరి మృతి - 10 మందికి తీవ్ర గాయాలు

యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెద్దకందుకూరులో భారీ పేలుడు సంభవించింది. ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్ పరిశ్రమలో పేలుడు సంభవించడంతో ఒక కార్మికుడు మృతిచెందగా.. మరో 10 మంది కార్మికులకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు సంభవించడంతో కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాణ భయంతో కంపెనీ నుంచి బయటకు పరుగులు తీశారు.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలిస్తున్నారు. పేలుడు సమాచారం అందుకున్న వెంటనే కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పేలుడు జరిగిన వెంటనే సైరన్ మోగించి మిగతా కార్మికులను అప్రమత్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలిస్తున్నారు. ఘటన ఎలా జరిగిందన్న దానిపై ఆరా తీస్తున్నారు.

### జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ప్రమాదం

హైదరాబాద్: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని దూలపల్లిలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ కెమికల్ గోదాంలో భారీగా మంటలు ఎగిసి పడి.. నిమిషాల్లో దట్టమైన పొగలు వ్యాపించాయి. పొగలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదం సంభవించడంతో దూలపల్లిలో కొంత సమయం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు.



## విదేశాల్లో ఉన్న అల్లుడిపై కేసు నమోదు చేసేలా ఆదేశించండి..

### హైకోర్టులో 84 ఏండ్ల వృద్ధుడు పిటిషన్

**విచారణ అర్హతపై వివరణ ఇవ్వండి**

**పిటిషనర్‌ను ఆదేశించిన హైకోర్టు**

విదేశాల్లో ఉన్న అల్లుడిపై కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలంటూ హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన 84 ఏళ్ల వృద్ధుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అమెరికా కాలిఫోర్నియాలో ఉన్న తన కుమార్తెను అల్లుడు చిత్రహింసలకు గురి చేస్తున్నారని, అల్లుడిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ కుమార్తె భారత పౌరురాలిగా ఇకడి పోలీసుల నుంచి రక్షణ పొందే హకు ఉందని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పిటిషన్ విచారణార్హత ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.ఏవైనా అభ్యంతరాలంటే అమెరికాలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వ న్యాయవాది కూడా పిటిషన్ విచారణార్హం కాదనగా న్యాయమూర్తి విచారణను 8కి వాయిదా వేస్తూ విచారణార్హతపై వివరణ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాదికి ఆదేశాలు జారీ చేశారు.



KR TV మన క్రాంతి




## సినిమా టికెట్ల ధర పెంపుతో జీఎస్టీ రూపంలో ఖజానాకు ఆదాయం..

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): సినిమా టికెట్ల ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో ఆదాయం వస్తుందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ సినిమా 'గేమ్ ఛేంజర్ ' సినిమా ఈ నెల పదో తేదీన విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలో జరిగిన మెగా పవర్ ఈవెంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ టికెట్ల ధరల పెంపు విషయంలో నెగెటివ్ ప్రచారం జరుగుతుందన్నారు. టికెట్ల ధర పెంపు డిమాండ్ అండ్ సప్లయ్ ఆధారంగా ఉంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

గతంలో దర్శకుడు శంకర్ తీసిన జెంటిల్‌మెన్ సినిమాను తాను బ్లాక్‌లో టికెట్ కొని చూశానని, అలా టికెట్ కొనడం వల్ల ఆ డబ్బు వేరే వాళ్లకు వెళుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వం సినిమా టికెట్ల ధరలు పెంచడం వల్ల జీఎస్టీ రూపంలో ఆదాయం వస్తుందన్నారు. గతంలో తన సినిమాకు టికెట్ ధరలు పెంచలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 'భీమ్లా నాయక్' సినిమాకు టికెట్ల ధరలు పెంచక పోగా తగ్గించిందని చెప్పారు. తమ కూటమి ప్రభుత్వానికి సినీ నటులంతా మద్దతు తెలుపలేదని, అయినా తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. సినీ పరిశ్రమకు రాజకీయ రంగు పులమడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదన్నారు.

తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి మాట్లాడాలంటే సినిమాలు తీసే వారే మాట్లాడాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. చిత్ర పరిశ్రమలో క్రమశిక్షణ రావాలని అన్నారు. 'సినిమాలు తీసే వాళ్లతోనే మేం మాట్లాడతాం. సినిమా టికెట్ ధరల విషయంలో హీరోలతో పనేమిటి.. నిర్మాతలు గానీ, ట్రేడ్ యూనియన్ సంఘాలు కానీ రావాలి. హీరోలు వచ్చి నమస్కారాలు పెట్టాలనేంత కింది స్థాయి వ్యక్తులం కాదు. ఎన్టీఆర్ పాటించిన ఔన్నత్యాన్ని మేం కొనసాగిస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఆయన తోటి నటులను గౌరవించే వారు. సినీ పరిశ్రమపై మా కూటమి ప్రభుత్వానికి గౌరవం ఉంది. తెలుగు సినిమా పరిశ్రమను సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉన్నారు. సినిమా మంచీ చెడూ రెంటిని చూపుతుంది. సమాజాన్ని ఆలోచింపజేసే బాధ్యతతో తెలుగు చలన చిత్ర పరిశ్రమ సినిమాలు తీయాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు.






## వైకుంఠ ఏకాదశి వేళ భక్తులకు టీటీడీ చైర్మన్ కీలక సూచనలు

అమరావతి ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో సామాన్య భక్తులు ప్రశాంతంగా శ్రీవారిని దర్శించుకునేలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు తెలిపారు. 2025 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా టీటీడీ అధికారులు, మునిసిపల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి శనివారం రామచంద్ర పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు సంయమనం పాటించి శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు. 10 రోజుల పాటు భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు మంజూరు చేస్తారన్నారు.

తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారని బీఆర్ నాయుడు తెలిపారు.

జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేసేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, బారికేడ్లు, షెడ్లు, భద్రత, తాగునీరు, మరుగుదొడ్లు తదితర పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## వైకుంఠ ఏకాదశి వేళ భక్తులకు టీటీడీ చైర్మన్ కీలక సూచనలు

అమరావతి ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో సామాన్య భక్తులు ప్రశాంతంగా శ్రీవారిని దర్శించుకునేలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు తెలిపారు. 2025 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా టీటీడీ అధికారులు, మునిసిపల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి శనివారం రామచంద్ర పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.


ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు సంయమనం పాటించి శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు. 10 రోజుల పాటు భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు మంజూరు చేస్తారన్నారు.

తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారని బీఆర్ నాయుడు తెలిపారు.

జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేసేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, బారికేడ్లు, షెడ్లు, భద్రత, తాగునీరు, మరుగుదొడ్లు తదితర పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.




## పోలవరంతో తెలంగాణకు ముప్పుపై ఐఐటీ హైదరాబాద్‌తో అధ్యయనం..!



అమరావతి ,04 జనవరి ( క్రాంతి న్యూస్ ): వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్వాసితులకు మొండి చేయి చూపారని ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రూ. 10 లక్షల పరిహారం అందిస్తామని పాదయాత్రలో చెప్పి, అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల్లో ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన పలు అభివృద్ధి, శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం తాజాగా పోలవరం నిర్వాసితులకు ఒకే రోజు రూ. 815 కోట్ల పరిహారం అకౌంట్లలో జమ చేశామన్నారు. వైసీపీ హయాంలో పోలవరం విధ్వంసానికి గురైందని ఆరోపించారు.

చంద్రబాబు పోలవరాన్ని పునర్నిర్మిస్తున్నారని తెలిపారు. జాతీయ ప్రాజెక్టయిన పోలవరానికి కేంద్రం అన్ని రకాలుగా సహకారాలు అందిస్తుందని , నిర్దేశిత సమయంలో పోలవరాన్ని పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

### తాడిపత్రి జనసేన ఇంచార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి చేసిన



అమరావతి ,04 జనవరి ( క్రాంతి తాడిపత్రి )

తాడిపత్రి జనసేన ఇంచార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి చేసిన

ను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దొంగలతో పోలీసులు చేతులు కలిపారని శ్రీకాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం ఆయన్ను అరెస్టు చేశారు.


తాడిపత్రిలో దొంగలతో పోలీసులు చేతులు కలిపి వాటాలు పంచుకుంటున్నారని జనసేన నేత కదిరి శ్రీకాంత్ శుక్రవారం నాడు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు శనివారం ఉదయం శ్రీకాంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. తమపై చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కోరారు. కానీ వివరణ ఇవ్వాలని ఇంటికి వచ్చిన పోలీసులతోనూ శ్రీకాంత్ రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. సీఐ ప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహించిన పోలీసులు శ్రీకాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తాడిపత్రి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కాసేపటికే శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు విడిచిపెట్టారు.

జనసేన నేత శ్రీకాంత్ రెడ్డిని అరెస్టు చేయడం, ఆ వెంటనే విడుదల చేయడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు శ్రీకాంత్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేశారు? ఆ వెంటనే ఎందుకు విడుదల చేశారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై క్లారిటీ ఇవ్వాలని కోరారు.

## గేమ్‌ఛేంజర్ సినిమాకు టికెట్ల ధరల పెంపు.. బెనిఫిట్ షోలకు అనుమతి

అమరావతి ,04 జనవరి ( క్రాంతి తాడిపత్రి ) తమిళ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా వస్తున్న గేమ్‌ఛేంజర్ సినిమాకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. టికెట్ ధరల పెంపుతో పాటు బెనిఫిట్ షోలకు అనుమతినిచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంట ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600గా ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది.

దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న గేమ్‌ఛేంజర్ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టికెట్ల ధరలను మల్టీప్లెక్స్‌ల్లో అదనంగా రూ. 175(జీఎస్టీతో కలిపి), సింగిల్ థియేటర్లలో రూ. 135(జీఎస్టీతో కలిపి) వరకు పెంచుకునేందుకు అనుమతినిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 11వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇవే ధరలు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తేదీల్లో రోజుకు 5 షోలు నిర్వహించుకునేందుకు కూడా అనుమతినిచ్చింది.



విడుదల తేదీ అయిన జనవరి 10న మాత్రం ఆరు షోలు నిర్వహించుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి తెలిపింది. ఉదయం 4 గంటలకు ప్రత్యేక షో వేసుకునేందుకు అనుమతినిచ్చింది.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి..

### సామాన్య భక్తులకు సులభంగా ద్వార దర్శనం.. టీటీడీ కీలక చర్యలు

వైకుంఠ ఏకాదశి వేడుకలకు తిరుమల ముస్తాబవుతోంది. తిరుమలలో జనవరి 10వ తేదీ నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు మొదలుకానున్నాయి. పది రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో వైకుంఠ ద్వార దర్శనాల కోసం తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. సామాన్య భక్తులకు సులభతరంగా వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తిరుమల శ్రీవారి భక్తులకు జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం సులభంగా కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులకు తిరుపతి, తిరుమలలో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ, వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీవారి ఆలయంలో కైంకర్యాల నిర్వహణ, భక్తుల భద్రత, దర్శనం, వసతి, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నప్రసాదం, ఇతర ప్రధాన అంశాలపై టీటీడీ ఈవో సుదీర్ఘంగా చర్చించారు. వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా తిరుమలకు వచ్చే భక్తుల కోసం వివిధ పార్కింగ్ ప్రాంతాలను కేటాయించాలని సూచించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని టీటీడీ అధికారులను ఆదేశించారు.

సమీక్షా సమావేశం సందర్భంగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ అధికారులు సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ రూపొందించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ మాస్టర్ ప్లాన్ భవిష్యత్తులోనూ ఉపయోగకరంగా ఉండేలా రూపొందించారు. అలాగే వైకుంఠ ఏకాదశి కోసం మైసూర్ దసరా ఉత్సవాలలో విద్యుత్ దీపాలంకరణలు అందించే మైసూర్ నిపుణులను తీసుకురానున్నారు. ఈ నిపుణుల ద్వారా ఈ వైకుంఠ ఏకాదశికి తిరుమల, తిరుపతిలలో విద్యుత్ అలంకరణలు చేయనున్నారు. అలాగే పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలు ఏర్పాటు చేయనున్నారు.

మరోవైపు వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లను తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జారీచేస్తారు. అలాగే తిరుమలలోని వారి కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. మొదటి మూడు రోజులకు సంబంధించిన టోకెన్లను జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి జారీ చేస్తారు. మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నారు.





# గడ్డి మేయడానికి వెళ్లిన దున్నపోతు..

### రెండు రాష్ట్రాల పోలీసులకు పనిచెప్పిందిగా!

కుక్క పిల్ల, సబ్బుబిళ్ల, అగ్గిపుల్ల.. కాదేదీ కవితకు అనర్హమని అప్పట్లో శ్రీశ్రీ మహానుభావుడు అన్నారు. ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో కానీ.. ఈ కవితకు అర్థం మార్చేస్తున్నారు ఇవాళ్టి జనం. కుక్క పిల్ల.. కోడి పిల్ల.. దున్నపోతు.. కాదేదీ కయ్యానికి అనర్హం అంటూ కొత్త భాష్యం చెప్తున్నారు. ఈ వివరాల్లోకి వెళ్తే.. అనగనగా ఓ దున్నపోతు. ఆ దున్నపోతు కోసం రెండూర్ల కొట్లాట. మాదంటే మాదంటూ పొట్టుపొట్టున కొట్టుకున్నారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే అందులో ఒక ఊరు ఆంధ్రప్రదేశ్‌లోది అయితే మరో ఊరు కర్ణాటకలోనిది. దున్నపోతు కోసం ఈ రెండు గ్రామాలు భీకరంగా కొట్టుకున్నాయి. తమ సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ పోలీసుల వద్దకు పంచాయతీ చేరింది. అటువైపు కర్ణాటక పోలీసులు, ఇటువైపు ఏపీ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే ఈ దున్నపోతు పంచాయతీ ఎందుకు మొదలైంది.. ఎలాంటి మలుపులు తిరిగింది. ఎలా శుభంకార్డు పడిందనేది ఇప్పుడు చూద్దాం.

కర్ణాటకలోని బళ్లారి జిల్లా బొమ్మనహాల్ గ్రామం.. ఈ ఊరిజనం ఐదేళ్లకోసారి సక్కమ్మ దేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సారి కూడా జనవరి నెలలో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. జాతరలో భాగంగా అమ్మవారికి సమర్పించేందుకు ఓ దున్నపోతును కూడా సిద్ధం చేసుకున్నారు. అయితే ఇక్కడ కథ అనుకోని మలుపు తిరిగింది. ఈ దున్నపోతు తమదంటూ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మేడేహాల్ గ్రామ ప్రజలు గొడవకు దిగారు. బొమ్మనహాల్, మేడేహాల్ గ్రామాల మధ్య సుమారుగా 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే తమ దున్నపోతును మేత కోసం వదిలితే.. దారి తప్పి మేడేహాల్ చేరిందని బొమ్మనహాల్ గ్రామ ప్రజల వాదన. కాదు కాదు.. ఈ దున్న తమదేనని మేడేహాల్ గ్రామవాసుల వాదన.తమ దున్నపోతు మేడేహాల్ గ్రామంలో ఉన్న విషయం తెలుసుకున్న బొమ్మనహాల్ ప్రజలు.. దున్నపోతును వెనక్కి తెచ్చుకునేందుకు మేడేహాల్ వెళ్లారు. అయితే దున్నను ఇవ్వడానికి మేడేహాల్ వాసులు తిరస్కరించారు. దీంతో దున్నపోతు కోసం రెండు గ్రామాల ప్రజల మధ్య గొడవ జరిగింది. చివరకు ఈ విషయం పోలీసులను చేరింది. ఈ దున్నపోతు పంచాయితీని తేల్చాలంటూ బళ్లారి జిల్లా మోకా పోలీసులను రెండు గ్రామాల ప్రజలు ఆశ్రయించారు. దున్నపోతు తమదేనని.. దున్నపోతు తల్లి కూడా తమ వద్దే ఉందని బొమ్మనహాల్ ఊరిజనం పోలీసులకు చెప్పారు. కావాలంటే డీఎన్ఏ పరీక్ష చేసుకోవాలన్నారు. అటు మేడేహాల్ వాసులు కూడా దున్నపోతుకు డీఎన్ఏ పరీక్ష చేయాలని పట్టుబట్టారు. దీంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.అయితే ఈ సమస్యను పోలీసులు శాంతియుతంగా పరిష్కరించారు. ఏపీ, కర్ణాటక పోలీసులు కలిసి సమన్వయంతో ఈ సంక్లిష్టమైన దున్నపోతు సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. బళ్లారి జిల్లా మోకా పోలీసులు, కర్నూలు జిల్లాలోని హాళహర్వి పోలీసులు రెండు గ్రామాల ప్రజలను కూర్చోబెట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సమస్యకు ఇక్కడితో ఫుల్ స్టాప్ పెట్టాలని.. మరోసారి ఇలాంటి గొడవలు జరగకూడదంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో బొమ్మనహాల్ ప్రజలకు దున్నపోతును అప్పగించేందుకు మేడేహాల్ ప్రజలు అంగీకరించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించింది.రెండు రాష్ట్రాల పోలీసులకు పనిచెప్పిందిగా!

# గిరిజనతండా జోలికొస్తే తరిమికొడతాం

**● గిరిజన గ్రామ పంచాయతీల జోలికి రావద్దు ● మిములను ఉరి లోపలికి రానివం**

**● యన్ టి విఎస్. రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రామన్న నాయక్**



చెన్నరావుపేట,04 జనవరి (క్రాంతి న్యూస్ ): వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలని పత్తి నాయక్ తండ గ్రామపంచాయతీలో గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు రామన్న నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో లంబాడి గిరిజన ప్రజలు క్రియాశీల పాత్ర పోషించడం జరిగింది. నర్సంపేట నియోజకవర్గంలో 40,000వేలపై బడి లంబాడి ఓట్లు దండుకొని లంబాడీలకే ద్రోహం తలపెడుతున్న స్థానిక ప్రజాప్రతినిధులారా ఖబర్దార్.. లంబాడి ప్రజల ఓట్లతో రెండు సార్లు శాసనసభకు ఎన్నికై పాము తన పిల్లలకు మింగినట్టు మా లంబాడీ ఓట్లు దండుకొని మా మీదే కక్షపూరితమైన కుట్ర పన్న డం నీకు తగునా..?

ఇప్పటికైనా మీయొక్క మొండి వైఖరిని మార్చుకొని చెన్నారావుపేట మండలంలోని పత్తి నాయక్ తండ గ్రామపంచాయతీని గత ప్రభుత్వం 2018 సంవత్సరంలో నూతన గ్రామపంచాయతీ గా ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలపాటు మా తండాలో మా రాజ్యం అనే నినాదంతో గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న గ్రామపంచాయతీని అభివృద్ధి చేయడం జరిగింది

ఈ క్రమంలో తమ స్వార్ధ రాజకీయాల కోసం గ్రామ పంచాయితీ విలీనానికి కుట్ర పన్నడం సరైన ధోరణి కాదని ఇప్పటికైనా మీ వైఖరి మార్చుకోకుంటే మీకు ఏ లంబాడీతండాల్లో రానివ్వకుండా తరిమి తరిమి కొడతామని మీకు రాజకీయ సమాధిని చేస్తామని వారు హెచ్చరించారు.


మీ అంగ బలం డబ్బు బలం అధికార బలంతో స్థానిక అధికారులతో ఎంపీడీవో తో దొంగ తీర్మానాలు చేయించి గిరిజన లంబాడీల మధ్య చిచ్చు రేపే ప్రయత్నం చేస్తున్నటువంటి స్థానిక ఎమ్మెల్యే ఇకపై గిరిజనులపట్ల సానుకూలంగా ఉండాలని ఉన్నత జిల్లా అధికారుల అదేశాలు లేకుండా, గ్రామ సభ నిర్వహించ కుండానే దొంగ తీర్మానాలు చేసి పంపించిన గిరిజన ద్రోహి స్థానిక ఎంపీడీవో పైతక్షణమే చర్యలు తీసుకొని వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

లేనిపక్షంలో గిరిజన విద్యార్థులు, యువతీయువకులు వివిధ గిరిజన ప్రజ సంఘాల మేధావులతో పెద్ద ఎత్తున రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో టి యన్ ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి ధరవత్ సుభాస్ నాయక్, భూక్యా కళ్యాణ్ నాయక్, భూక్యా మంగిలాల్, బోడ మురళీ నాయక్, శంకర్ నాయక్, స్వామి నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టియుసి కృషి ఫలితమే క్యాజువల్ లీవ్స్ మంజూరు

## కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,04 జనవరి (క్రాంతి న్యూస్ ): నూతనంగా రిక్రూట్ అయిన జూనియర్ అసిస్టెంట్ లకు 2023 సం గాను 11 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయటం కోసం కృషి చేసిన ఐ ఎన్ టి యు సి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ కు కృతజ్ఞతలు తెలియజేసిన జూనియర్ అసిస్టెంట్స్, కొత్తగూడెం ఏరియా జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ సాగర్ ఆధ్వర్యంలో ఐ ఎన్ టి యుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ను సన్మానించడం జరిగింది.

సింగరేణి లో నోటిఫికేషన్ 02/2022 ద్వారా రిక్రూట్ కాబడిన 176 జూనియర్ అసిస్టెంట్ లు డిసెంబర్ 18, 2023 న విధులలో చేరితే కొన్ని కారణాల వల్ల వారి విది నిర్వహణ తాత్కాలికంగా ఆపి మరల వారిని 05 ఫెబ్రవరి 2024 విధులను పునఃప్రారంభించ గా వీరికి 15 సిక్ లీవ్లు అదే నెలలో జమ కాగా వారికి రావాల్సిన 11 సీఎల్ జమకాలేదు ఇట్టి విషయం తెలిసిన వెంటనే యాజమాన్యంతో మాట్లాడి వారికి రావాల్సిన 11 సీఎల్ లను ఇప్పించడం జరిగింది. ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, డైరెక్టర్ పా వెంకటేశ్వర్ రెడ్డి, జిఎం శాలెం రాజు, జిఎం పర్సనల్ కవిత నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, కార్పొరేట్ , ఏరియా పర్సనల్ సిబ్బందికి ప్రతి ఒక్కరికి, కొత్తగూడెం ఏరియా లో ఉన్నటువంటి జూనియర్ అసిస్టెన్స్, జిఎం ఆఫీస్ పిట్ సెక్రటరీ సాగర్ కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తగూడెం ఏరియా జూనియర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# అధైర్యపడకండి.. ఆదుకుంటా..

## -మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



పెద్దవంగర,04 జనవరి (క్రాంతి న్యూస్ ): అధైర్యపడవద్దని.. అన్ని విధాలుగా ఆదుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. చిన్నవంగర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోదెపల్లి అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు శనివారం చికిత్స పొందుతున్న అశోక్ ను పరామర్శించి, మనోధైర్యం కల్పించాడు. అధైర్య పడవద్దు అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, తొర్రూరు మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు కాసాని హరీష్, జనగాం సత్యనారాయణ, దుంపల వేణు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఓ చే పిఆర్టియు టీఎస్ చిట్యాల మండల శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ....!



చిట్యాల,04 జనవరి (క్రాంతి న్యూస్ ): స్పెషల్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ చిట్యాల మండల శాఖ క్యాలెండర్ ను చిట్యాల మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)కొడెపాక రఘుపతి ఆవిష్కరించారని మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు బండి శ్రీనివాస్ గౌడ్, సూదం సాంబమూర్తి తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ హాజరై పి ఆర్ టి యు సంఘం చరిత్రను,సంఘం సాధించిన విజయాలను ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు వివరించడం జరిగింది.ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపే సంఘం పిఆర్ టి యు టి ఎస్ అని,సమస్యల సాధనపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒకసంధానకర్తగా ఉండి సమస్యల సాధనపై పరిష్కార మార్గం చూపిస్తుందని కిరణ్ కుమార్ అన్నారు.మండల విద్యాధికారి కోడేపాక రఘుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద సంఘం పిఆర్టియు సంఘం అని, సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి తీసుకెళ్లి పరిష్కరించడం పట్ల ఆయన కొనియాడారు.అనంతరం మండలంలోని చల్లగరిగ, జూకల్ చిట్యాల, జడలపేట, నైన్ పాక ఉన్నత పాఠశాలలతో పాటు పలు ప్రాథమిక పాఠశాలలో నూతన క్యాలెండర్లను మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, సాంబమూర్తి, ఉపాధ్యాయులకు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ రెడ్డి, కృష్ణ, వాసంతి, ఊర్మిళా రెడ్డి లతోపాటు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సాంబారు రామనారాయణ ,కూచనపల్లి శ్రీనివాస్, గోవింద సత్యనారాయణ, రహీం పాషా, మోరిశెట్టి సుజాత,లింగయ్య , సదానందం,మధు ,విజయశాంతి, బండి ప్రసాద్ గౌడ్, గాజర్ల శ్రీనివాస్, స్వరూప రాణి, పల్లవి, పావని,లతోపాటు తదితర పాఠశాలలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాక్స్ 1995 చట్టంపైన, ఐకేపీ సెర్ప్, ఏపీఎం, సీసీ లకు శిక్షణ కార్యక్రమం.

వికారాబాద్ జిల్లా ,04 జనవరి (క్రాంతి న్యూస్ ): సీఈఓ సెర్ప్ తెలంగాణ ఆదేశానుసారం మాక్స్ 1995 చట్టం క్రింద రిజిస్ట్రేషన్ కాబడిన మహిళా సమాఖ్యలు తమ బైలా నందు సవరణలు చేసుకున్న నిమిత్తం ఇట్టి ఉపవిధులు నిబంధనావళి పై జిల్లాస్థాయిలో అందరూ ఏపీఎం లు మరియు సీసీ లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

వికారాబాద్, తాండూర్, పరిగి క్లస్టర్ సిబ్బందికి జనవరి 7,8,9,(2025) తేదీలలో శిక్షణలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా శనివారం, మండలం నుండి ఇద్దరు సీసీలను ఎంపిక చేసి జిల్లా సమైక్య భవనం, ఐడివోసి నందు శిక్షణ ప్రారంభించడం జరిగింది. ఇట్టి శిక్షణకు జిల్లా గ్రామీణాభివృద్ధి కారి, అడిషనల్ డిఆర్డివో, డీపీఎంలు మరియు డిఆర్డిఎ సిబ్బంది హాజరు కావడం జరిగింది.





# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందంజలో పిఆర్టియు టీఎస్

## అభినందించిన డిప్యూటీ. సీఈవో శ్రీమతి వసుమతి






చెన్నరావుపేట,04 జనవరి (క్రాంతి న్యూస్ ): వరంగల్ జిల్లా పరిషత్ పి ఆర్ టి యు టి ఎస్ సమావేశంలో జిల్లా పరిషత్ వరంగల్ జిల్లాలో జరిగినటువంటి నూతన క్యాలెండర్ డైరీ ఆవిష్కరణలో భాగంగా సీఈఓ శ్రీమతి. వసుమతి, మరియు జిల్లా పరిషత్ సూపరిండెంట్ శ్రీ ఉదయ భాస్కర్ గారిని, కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పీఆర్టీయూ క్యాలెండర్ మరియు డైరీ లను బహూకరించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు యూదునూరి రవీందర్ రెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ గఫార్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీ గుంటి సురేష్ వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీ కటకం రఘు, మార్తా శ్రీనివాస్, ఈ సమావేశంలో పి .ఆర్ .టి .యు. వివిధ ఉపాధ్యాయ సమస్యలు ముందుండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని సంఘం బాధ్యులు ఉపాధ్యాయ టీచర్లకు భరోసానివ్వడం జరిగింది.


# పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేస్తానని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హామీ.



వికారాబాద్ జిల్లా ,04 జనవరి (క్రాంతి న్యూస్ ): శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సభాపతి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే, కొత్తగా నూతన పథకాలను తీసుకువస్తూ ప్రజల సంక్షేమ, అభివృద్ధి దిశగా ప్రభుత్వ పని చేస్తున్నట్లు సభాపతి తెలిపారు. రైతు భరోసాలో భాగంగా పరిమితి లేకుండా సాగు చేసే ప్రతి భూమికి సంక్రాంతి నుండి రైతు భరోసాను వర్తింప చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ కార్డు ఉన్న లబ్ధిదారులకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయనున్నట్లు సభాపతి తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గానికి 12 వేల ఇండ్లు మంజూరు అయ్యాయని, మరో విడతలో కూడా ఇంకా ఇల్లు మంజూరు అవుతాయని తెలిపారు. నియోజకవర్గంలో ఇంటి స్థలం లేని వారిని గుర్తించి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం గావించి అందజేస్తామని ఆయన తెలిపారు.రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం పైన, మాపైన ప్రజల ఆశీస్సులు, దేవుని దీవెనలు ఉండేలా ప్రార్థించాలని సభాపతి కోరారు.

ముందుగా మార్కెట్ కమిటీ భవన ఆవరణలో 70 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు ప్రారంభోత్సవం గావించారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన మరమ్మతులు, మార్కెట్ యార్డులో షెడ్ లకు, కార్యాలయానికి విద్యుద్దీకరణ మరమ్మత్తు పనులు చేపట్టనున్నారు. ముందుగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు సభాపతి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సిబ్బంది సభాపతికి నాగలిని బహుకరించారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, ఆర్డీవో వాస్తు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ పర్సన్ ఇంచార్జ్ ఎండి రియాజ్, కార్యదర్శి ఎండి ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





# దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి పూర్తి మద్దతు



హుస్నాబాద్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని వైశ్య భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వి నరేందర్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని తెలంగాణ పీసీసీకి దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం వంశీ, జేరిపోతుల కిరణ్ కుమార్, న్యాయవాది కాంగ్రెస్ పార్టీ పట్టపద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి కి టికెట్ కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ కి దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకం వంశీ విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణం వైశ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర విద్యా సంస్థలకు దీటుగా తెలంగాణలో విద్యా సంస్థలు నెలకొల్పి వేలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను, తక్కువ ఫీజు విద్యను అందిస్తూ అందించి యువతకు ఉపాధి కల్పించి తెలంగాణ రాష్ట్ర విద్యాభివృద్ధికి బాసటగా నిలుస్తున్నారు. అన్ని వర్గాలతో సత్సంబంధాలు కలిగి వేలాది మంది పట్టభద్రుల అండదండలున నరేందర్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని కోరారు.పట్టభద్రుల అభివృద్ధికి బాసటగా నిలుస్తున్న నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కనకం వంశీ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో జేరిపోతుల కిరణ్ కుమార్,రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల రవీందర్, మణికొండ ఏసుదాస్, పారనంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ జరపాలంటూ ఏకసభ్య కమిషన్ చైర్మన్ కు వినతి పత్రం అందజేసిన వర్గీకరణ జేఏసీ...

నెల్లూరు ,04 జనవరి (క్రాంతి న్యూస్ ): నెల్లూరు నగరంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయం నందు ఎస్సీ వర్గీకరణ కులాల ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ను ఎస్సీ వర్గీకరణ సాధన జేఏసీ గౌరవ అధ్యక్షులు పందిటి సుబ్బయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో మాదిగ సామాజిక వర్గం ఉద్యోగాలపరంగా రాజకీయపరంగా ఎంతో వెనకబడి ఉందని ఉదాహరణలతో సహా వినతిపత్రం అందజేశారు రాష్ట్రాన్ని ఒక యూనిట్ గా తీసుకొని వర్గీకరణ చేయాలని తమ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుబ్బారావు, పల్లాల శ్రీనివాసులు, శేఖర్, విజయ్ కుమార్, ఆనందరావు, చిన్నయ్య, వర్గీకరణ సాధన జేఏసీ సభ్యులు జిల్లా వ్యాప్తంగా మాదిగ జాతి బిడ్డలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ.. మూన్ సోషల్ సర్వీస్



నెల్లూరు ,04 జనవరి (క్రాంతి న్యూస్ ): నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ చైర్ పర్సన్ రబియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ సంస్థ ద్వారా అనుమతి పొంది నెల్లూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి తదనంతరం ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో విజయం సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం హెూటల్ అభిరామి వెనుక భాగంలో కల సికిందర్ కేఫ్ మిద్దె పైన కార్యాలయం నందు రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు దీనికి సంబంధించి ఈ క్రింది నెంబర్ కు 6281259285 సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సలీం, సాయి కుమార్ రెడ్డి, షేక్ ఆయేషా, రఫీ , కల్పలత, మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.....

# ఆరోగ్య క్రాంతి

## రోజూ ఒక జామ పండును తింటే ఇన్ని లాభాలు కలుగుతాయా..?

హెల్త్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): మనకు ఏడాది పొడవునా దాదాపుగా అన్ని సీజన్లలోనూ చాలా వరకు పండ్లు అందుబాటులో ఉంటాయి. కానీ అలాంటి పండ్లను మనం సరిగ్గా తినడం లేదు. వాటిల్లో జామ పండ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. ఇవి మనకు ఏ సీజన్‌లో అయినా సరే లభిస్తాయి. అయితే కొందరు జామ పండ్లను ఇష్టంగానే తింటుంటారు. కానీ వీటిని అధిక శాతం మంది అంతగా పట్టించుకోరు. వాస్తవానికి జామ పండ్లలో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. జామ పండ్లను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఈ క్రమంలోనే రోజుకు కనీసం ఒక్క జామ పండును అయినా తింటే ఎన్నో లాభాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జామ పండ్లను రోజూ తినడం వల్ల ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.



### రోగ నిరోధక శక్తికి..

జామ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో గాయాలు త్వరగా మానుతాయి. మనం తినే ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. జామ పండ్లలో ఫైంర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. విరేచనాల నుంచి ఉపశమనం అందిస్తుంది. విరేచనాలు అవుతున్న వారు జామ పండ్లను తింటే త్వరగా కోలుకుంటారు. ఇక అధిక బరువును తగ్గించడంలోనూ జామ పండ్లు అద్భుతంగా పనిచేస్తాయి. జామ పండ్లలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఫలితంగా ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది.

### గుండె ఆరోగ్యానికి..

గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో జామ పండ్లు ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ పండ్లలో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. అలాగే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జామ పండ్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. రోజూ ఒక జామ పండును తింటుంటే కళ్లద్దాలను తీసి పడేస్తారు. గర్భంతో ఉన్న మహిళలు జామ పండ్లను తింటే ఎంతగానో మేలు జరుగుతుంది. దీని వల్ల ఫోలేట్ లభిస్తుంది. ఇది శివువు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదపడుతుంది.

### నొప్పులు, వాపులకు..

జామ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మంపై వచ్చే దద్దుర్లు, దురదలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. అదేవిధంగా జామ పండ్లను తినడం వల్ల షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. జామ పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే షుగర్ లెవల్స్ అంత త్వరగా పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. అయితే జామ పండ్లను ఆహారంలో భాగం చేసుకుంటే షుగర్ లెవల్స్ మరీ తక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. కనుక లో షుగర్ సమస్య ఉన్నవారు ఈ పండ్లను తినకపోవడమే మంచిది. ఇక వీటిని తింటే శరీరంలోని నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. జామ పండ్లు సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్‌లా పనిచేస్తాయి. దీంతో నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా జామ పండ్లను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..

### అయితే మీ లివర్ ప్రమాదంలో పడిందని అర్థం..!

హెల్త్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): మన శరీరంలో అంతర్గతంగా ఉండే అవయవాల్లో లివర్ కూడా ఒకటి. ఇది సుమారుగా 800కు పైగా జీవక్రియలను నిర్వహిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేస్తుంది. మనకు శక్తి అందేలా చూస్తుంది. శరరీంలోని కొవ్వును కరిగిస్తుంది. వ్యర్థాలను బయటకు పంపుతుంది. అయితే ప్రస్తుతం చాలా మంది లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. చిన్న వయస్సులో ఉన్నవారికి కూడా ఫ్యాటీ లివర్ సమస్య వస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే లివర్‌లో కొవ్వు చేరినా, ఇతర కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అయినా మన శరీరం మనకు పలు సూచనలను తెలియజేస్తుంది. ఆ లక్షణాలను బట్టి మన లివర్ పాడైందని అర్థం చేసుకోవాలి. ఇక లివర్ డ్యామేజ్ అయినప్పుడు మన శరీరం ఎలాంటి సంకేతాలను చూపిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.



### పాదాల వాపులు..

లివర్ పనితీరు సరిగ్గా లేనప్పుడు శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతుంటాయి. ముఖ్యంగా అవయవాల్లో నీరు చేరుతుంది. దీంతో శరరీం వాపులకు లోనవుతుంది. కాళ్లలో, పాదాల్లో వాపులు వస్తాయి. మడమల దగ్గర వాపులు కనిపిస్తాయి. వేలితో నొక్కితే చర్మం లోపలికి పోతుంది. ఈ లక్షణం గనక కనిపిస్తుందంటే లివర్ పాడైందని అర్థం చేసుకోవాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే లివర్ డ్యామేజ్ అయిన వారికి పచ్చ కామెర్లు వస్తాయి. దీంతో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. అయితే కామెర్లు వచ్చినంత మాత్రాన లివర్ డ్యామేజ్ అయిందని కాదు. కానీ కామెర్లు కనిపిస్తే మాత్రం అజాగ్రత్త చేయకూడదు. అది లివర్ డ్యామేజ్‌కు సూచన కూడా అయి ఉండవచ్చు. కనుక ఈ లక్షణం కనిపించినా కూడా అనుమానించాల్సిందే.

### చర్మం కాంతిలో మార్పు..

లివర్ డ్యామేజ్ అయినప్పుడు లేదా లివర్‌లో కొవ్వు పేరుకుపోయినప్పుడు చర్మం మెరిసినట్లు కనిపిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను లివర్ బయటకు పంపలేదు. అందువల్ల చర్మం అలా కనిపిస్తుంది. ఈ లక్షణం కనిపిస్తున్నా కూడా జాగ్రత్త పడండి. అదేవిధంగా లివర్ డ్యామేజ్ అయితే కాళ్లలో రక్తనాళాలు సాలె పురుగుల మాదిరిగా బయటకు కనిపిస్తాయి. ఇక శరీరంలో ఏ భాగంలో అయినా సరే సులభంగా గాయాలు అవుతున్నా, తరచూ దురద వచ్చి దద్దుర్లు కనిపిస్తున్నా లివర్ డ్యామేజ్ అయిందని అర్థం చేసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నవారిలో సైతం ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి.

### గోళ్ల రంగు..

లివర్‌లో ఏదైనా సమస్య ఉంటే గోళ్లు కూడా రంగు మారుతాయి. గోళ్ల మీద తెలుపు రంగు మచ్చలను గమనించవచ్చు. లేదా గోళ్లు పసుపు రంగులోకి మారిపోతాయి. అలాగే నడుస్తున్నప్పుడు కాళ్లలో అసౌకర్యంగా ఉంటుంది. సరిగ్గా నడవలేకపోతుంటారు. ఈ లక్షణాలు ఎవరిలో అయినా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. లివర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలను చేయించుకోవాలి. దీంతో లివర్ సరిగ్గా పనిచేస్తుంది లేనిదీ తేలిపోతుంది. ఫలితంగా ఏదైనా సమస్య ఉంటే వెంటనే చికిత్స తీసుకోవచ్చు. దీని వల్ల లివర్ పూర్తిగా దెబ్బతినకుండా ఉంటుంది. ప్రాణాంతకం కాకుండా ముందుగానే మనల్ని మనం రక్షించుకోవచ్చు.

## వణికిస్తున్న కొత్త వైరస్

హెల్త్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): మహమ్మారి తర్వాత, చైనాలో హ్యూమన్ మెటా న్యూమోవైరస్ అనే వింత వైరస్ విస్తరిస్తోంది. దీంతో మళ్లీ కరోనాలాంటి మహమ్మారి వస్తుంధన్న భయం ప్రజల్లో నెలకొంది. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితి గురించి ధృవీకరించని వాదనలు లేవు. వైరస్ వ్యాప్తికి సంబంధించి చైనా అధికారులు ఆస్పత్రుల్లో రద్దీ పెరిగిందన్న వార్తలను చైనా ప్రభుత్వం ఖండించింది. ఇవన్నీ పూర్తిగా ఆధారరహితమని, ప్రజల్ని అనవసరంగా భయాందోళనకి గురి చేస్తున్నాయని తెలిపింది. అసలు ఈ వైరస్ లక్షణాలు, ప్రభావాలు, నివారణ పద్ధతుల గురించి తెలుసుకుందాం.

### వైరస్‌ని నివారించేందుకు

ఇది వైరల్ ఇన్ఫెక్షన్. అత్యంత సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్స్‌లో ఒకటి. కొన్నిసార్లు ఈ ఇన్ఫెక్షన్ల సంఖ్య పెరుగుతుంది. సాధారణంగా ముక్కుకారటం, దగ్గు ఉంటుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, క్యాన్సర్ రోగుల్లో తీవ్ర నష్టాన్ని, కొన్నిసార్లు మరణానికి కూడా కారణమవుతుంది. ఇమ్యూటినీ తక్కువగా ఉన్నవారిలో జలుబుతో న్యుమోనియా వస్తుంది. చలికాలంలో పిల్లలు ఆస్పత్రుల్లో ఉండాల్సి ఉంటుంది.

ఈ వైరస్ మాత్రమే కాకుండా, ఏ రకమైన వైరస్ అయినా సంక్రమించే ప్రమాదాన్ని నివారించడానికి, తగ్గించడానికి కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

### వైరస్‌ని నివారించేందుకు?

ఇది వైరల్ ఇన్ఫెక్షన్. అత్యంత సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్స్‌లో ఒకటి. కొన్నిసార్లు ఈ ఇన్ఫెక్షన్ల సంఖ్య పెరుగుతుంది. సాధారణంగా ముక్కుకారటం, దగ్గు ఉంటుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, క్యాన్సర్ రోగుల్లో తీవ్ర నష్టాన్ని, కొన్నిసార్లు మరణానికి కూడా కారణమవుతుంది. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో జలుబుతో న్యుమోనియా వస్తుంది. చలికాలంలో పిల్లలు ఆస్పత్రుల్లో ఉండాల్సి ఉంటుంది. ఈ వైరస్ మాత్రమే కాకుండా, ఏ రకమైన వైరస్ అయినా సంక్రమించే ప్రమాదాన్ని నివారించడానికి, తగ్గించడానికి కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

### వ్యాధి లక్షణాలు

దగ్గుజ్వరంముక్కు కారటంగొంతు నొప్పిగురకశ్వాస తీసుకోవడంలో ఇబ్బంది దద్దుర్లు మొదలైనవి. కొన్నిసార్లు ఇది తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తుంది. బ్రోన్కైటిస్, న్యుమోనియా, ఆస్తమా, క్రానిక్ న్యుమోనియా, ఇది చెవి ఇన్ఫెక్షన్స్‌కి కూడా కారణమవుతుంది. ఇలాంటప్పుడు ట్రీట్‌మెంట్ అవసరం.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

20 సెకన్ల పాటు సబ్బు, నీటితో చేతులు కడగాలి.

చేతులు కడుక్కోవడం సాధ్యం కానప్పుడు ఆల్కహాల్ శానిటైజర్‌ని వాడొచ్చు.

బయటికి వెళ్లేటప్పుడు ముక్కు, నోటిని కవర్ చేసేలా మాస్క్ ధరించండి.

దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతులతో ముక్కుని కవర్ చేసుకోవాలి.


జలుబు, ఇత అంటువ్యాధులు ఉన్నవారికి దూరంగా ఉండాలి. పిల్లల దగ్గరికి అలాంటి వారిని వెళ్లనీయకుండా చూడాలి.

లక్షణాలు తెలిసే వరకూ ఒంటరిగా ఉండడం మంచిది.

సమస్య ఉన్నప్పుడు పిల్లల్ని స్కూల్స్, కాలేజీలకు పంపొద్దు.

దీనికి ఇప్పటివరకూ వ్యక్సిన్ లేదు. పిల్లలు, పెద్దలు, షుగర్ ఉన్నవారు, క్యాన్సర్ పేషెంట్స్ జాగ్రత్తగా ఉండాలి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్, న్యుమోనియా, ఆస్తమా, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వాపుతో బాధపడేవారు రెగ్యులర్‌గా మందులు వాడాలి. డాక్టర్‌ని సంప్రదించాలి.

హ్యూమన్ మెటా న్యూమో వైరస్, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు అధిక సంఖ్యలో ఉన్నారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్ని చైనా అధికారులు ఖండించారు. కాబట్టి, అంతగా భయపడాల్సిన అవసరం లేదు. కానీ, మనల్ని మనం కాపాడుకునేందు ముందు నుంచే అన్నీ జాగ్రత్తలు తస్నీకోవాలి. హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం మంచిదని గుర్తుంచుకోండి



# అరుదైన రికార్డును సృష్టించిన యశస్వి జైస్వాల్..




స్పోర్ట్స్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్టులో టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ప్రత్యేక రికార్డును నెలకొల్పాడు. భారత్ 1932 నుంచి టెస్టు క్రికెట్ ఆడుతుండగా.. 92 సంవత్సరాల చరిత్రలో ఇలా జరుగడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ వేసిన బంతులను చితక్కొట్టి ఈ రికార్డును సృష్టించాడు. సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి 35 బంతుల్లో నాలుగు ఫోర్ల సాయంతో 22 పరుగులు చేశాడు. సునీల్ గవాస్కర్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి ఆటగాళ్లతో కూడిన స్పెషల్ క్లబ్‌లో చేరాడు. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన వెంటనే స్టార్క్ వేసిన తొలి ఓవర్‌లో యశస్వి జైస్వాల్ గేమ్ మార్చి ఒకే ఓవర్‌లో నాలుగు ఫోర్లు బాదాడు. ఆ ఓవర్‌లో రెండు, మూడు, నాలుగు, ఆరో బంతిని బౌండరీకి పంపి.. 16 పరుగులు చేశాడు. దాంతో టెస్టుల్లో తొలి ఓవర్‌లోనే అత్యధిక పరుగులు రాబట్టిన తొలి బ్యాటర్‌గా జైస్వాల్ రికార్డును సృష్టించాడు. ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్‌లో భారత బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక పరుగులు ఇదే.

**ఈ సిరీస్‌లో యశస్వి 391 పరుగులతో టాప్ స్కోరర్..**

యశస్వి 10 ఇన్నింగ్స్‌లలో కలిపి 391 పరుగులు చేశాడు. 43.44 సగటుతో పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ కోసం పర్యటించడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియాలో తొలి టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఓపెనర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో మురళీ విజయ్ ముందున్నాడు. విజయ్ 2014-15లో 482 పరుగులు చేశాడు. వీరేంద్ర సెహ్వాగ్ 2003-04లో 464, సునీల్ గవాస్కర్ 1977-78లో అరంగేట్రం చేసిన టెస్టు సిరీస్‌లో 450 పరుగులు చేశారు.

## ముగిసిన 2వ రోజు.. 6 వికెట్లు కోల్పోయిన భారత్..




స్పోర్ట్స్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): సిడ్నీలో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 5వ టెస్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియాపై 145 పరుగుల ఆధిక్యం సాధించింది. అంతకుముందు ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. 9/1 స్కోరుతో శనివారం రెండో రోజు ఆట ప్రారంభించిన కంగారూ జట్టు 172 పరుగుల వద్ద చివరి 9 వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగుల ఆధిక్యం లభించింది.నితీష్ రెడ్డి (4 పరుగులు), విరాట్ కోహ్లీ (6 పరుగులు), యశస్వి జైస్వాల్ (22 పరుగులు), కేఎల్ రాహుల్ (13 పరుగులు), శుభ్‌మన్ గిల్ (13 పరుగులు)లు మరోసారి తీవ్రంగా నిరాశ పరిచారు. అయితే, రిషబ్ పంత్ (61) మాత్రం తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో బోలాండ్ 4 వికెట్లు, కమిన్స్, వెబ్ స్టర్ తలో వికెట్ పడగొట్టారు.

ఆస్ట్రేలియా జట్టు తరపున తొలి ఇన్నింగ్స్‌లో బ్యూ వెబ్‌స్టర్ అత్యధిక స్కోరు 57 పరుగులు చేశాడు. స్టీవ్ స్మిత్ 33, సామ్ కొన్‌స్టాస్ 23 పరుగులు చేశారు. భారత బౌలర్లలో ప్రముఖ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ చెరో 3 వికెట్లు తీశారు. జస్ప్రీత్ బుమ్రా, నితీష్ కుమార్ 2-2 వికెట్లు తీశారు. శుక్రవారం మ్యాచ్‌లో తొలిరోజు భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. 5 టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం ఆతిథ్య జట్టు 2-1 ఆధిక్యంలో ఉంది.

# టీమిండియాకు షాక్.. గ్రౌండ్‌ను వీడి కారులో వెళ్లిన బుమ్రా




స్పోర్ట్స్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): టీమిండియా ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్. టీమిండియా కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా మైదానం వీడాడు. అవును.. ఐదో టెస్టు రెండో రోజు ఆటలో తొలి సెషన్ తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా ఆట నుంచి తప్పుకున్నాడు. అయితే బుమ్రా ఎందుకు తప్పుకున్నాడు? మైదానం వీడి ఎక్కడికి వెళ్లాడు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఐదో టెస్టు తొలి రోజు ఆటలో బుమ్రా.. ఖవాజా వికెట్ తీశాడు. ఇక రెండో రోజు ఆటలోనూ లబుషేన్‌ను ఔట్ చేసి వికెట్ల వేటను కొనసాగించాడు. అయితే ఈ ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు వేసి 2 వికెట్లు తీసిన తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా.. మైదానాన్ని వీడాడు. అంతకుముందు పలుమార్లు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. కానీ లంచ్ తర్వాత కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేసిన పేసర్.. మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టలేదు.

అయితే బుమ్రా.. మైదానంలో చురుగ్గానే ఉన్నాడు. ఎలాంటి అసౌకర్యానికి కూడా గురికాలేదు. కానీ అనూహ్యంగా మైదానం వీడాడు. అతడికి గాయమైందా? అయితే ఎక్కడ అయింది? వంటి వివరాలు మాత్రం తెలియలేదు. కానీ టీమ్ డాక్టర్‌తో కలిసి బుమ్రా.. కారులో బయలుదేరినట్లు వీడియోలో కనిపించింది. అయితే బుమ్రా స్కానింగ్‌కు వెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బుమ్రా మైదానాన్ని వీడటంతో విరాట్ కోహ్లీ.. సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ఈ సిరీస్‌లో బుమ్రా అదరే ప్రదర్శన చేస్తున్నాడు. ఇప్పటివరకు 32 వికెట్లు తీశాడు. మరి అతడు చివరి మ్యాచ్‌లో మళ్లీ బరిలోకి దిగుతాడా? లేదా అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ బుమ్రా దూరమైతే మాత్రం భారత్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లే.

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్.. 185 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. భారత బౌలర్ల ధాటికి 181 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 4 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 3, ప్రసిద్ధ్ కృష్ణ 3, బుమ్రా 2, నితీశ్ రెడ్డి 2 వికెట్లు తీశారు.

# సామ్ కాన్‌స్టస్-బుమ్రా వివాదంపై స్పందించిన రోహిత్ శర్మ..!

స్పోర్ట్స్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు సామ్ కాన్‌స్టాస్, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వివాదంపై రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. ఏ కారణం లేకుండా ఆటగాళ్లు గొడవకు దిగడం తగదని చెప్పాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన నాల్గో టెస్టులో బుమ్రా-కాన్‌స్టాస్ మధ్య పోటీ కనిపించింది. ఆస్ట్రేలియా యువ బ్యాట్స్‌మెన్ కాన్‌స్టాస్.. బుమ్రా బౌలింగ్‌కు కాస్త దూకుడు ప్రదర్శించాడు. రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్‌లోనే కాన్‌స్టాస్ అవుట్ అయ్యాడు.




**ఆటగాళ్లను వెనకేసుకువచ్చిన రోహిత్..**

భారత ఆటగాళ్ల దృష్టి తమ పనిపైనే ఉందని రోహిత్ పేర్కొన్నాడు. ఐదు టెస్టు రెండోరోజు లంచ్ సమయంలో రోహిత్ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ ఆస్ట్రేలియా ఆటగాళ్లు ప్రశాంతంగా ఉంటే.. తమ ఆటగాళ్లు సైతం ప్రశాంతంగా ఉంటారన్నారు. వారిని రెచ్చగొడితే ప్రశాంతంగా ఉండరని స్పష్టం చేశాడు. ఇక బుమ్రాపై రోహిత్ ప్రశంసలు కురిపించాడు. ఆటపై అతనికి మంచి ఆలోచన ఉందని.. తన బౌలింగ్‌తో మిగతా వారికి ఆదర్శంగా నిలిచాడని తెలిపాడు. అతన్ని 11 సంవత్సరాలుగా గమనిస్తున్నానని.. అప్పటికీ.. ఇప్పటికీ గ్రాఫ్ ఎంతో పెరిగిందని చెప్పాడు. బుమ్రా తమ బలమని.. ఇందులో ఎలాంటి సందేహం లేదని తెలిపాడు.

# టీబీఏ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు



స్పోర్ట్స్ న్యూస్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): తెలంగాణ బ్యా డ్మింటన్ అసోసియేషన్ (టీబీఏ) నూత న అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్(బీఏఐ) ఉపాధ్యక్షుడు పుల్లెల గోపీచంద్ శుక్రవారం అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.



# సినిమా న్యూస్

## లిప్ లాక్స్ సీన్స్ వల్ల చాలా అవకాశాలు కోల్పోయాను..



మూవీ డెస్క్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): ఒకే ఒక్క సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలో భారీ విజయాన్ని అందుకుంది. ఫస్ట్ మూవీలోనే అందం, అభినయంతో కట్టిపడేసింది. ఆ తర్వాత వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇంతకీ ఆ వయ్యారి ఎవరో తెలుసా.. ? టాలీవుడ్ ఇండస్ట్రీలో తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ అందుకుంది. కానీ ఇప్పుడు అంతగా ఆఫర్స్ రావడం లేదు. తెలుగు ప్రేక్షకులకు చాలా ఇష్టమైన హీరోయిన్ మృణాల్ ఠాకూర్. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వం వహించిన సీతారామం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ మూవీలో తన అద్భుతమైన నటనతో సినీప్రియులను కట్టిపడేసింది.కెరీర్ తొలినాళ్లల్లో బుల్లితెరపై పలు సీరియల్స్ ద్వారా ఫ్యామిలీ ఆడియన్స్ కు దగ్గరయ్యింది. ఆ తర్వాత హిందీలో కొన్ని సినిమాల్లో నటించి మెప్పించింది. సూపర్ 30, జెర్సీ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే తమిళంలో హీరో శివకార్తికేయన్ సరసన ఛాన్స్ రాగా.. కొన్ని కారణాలతో మిస్సైందని ప్రచారం జరిగింది. అయితే కెరీర్ తొలినాళ్లల్లో ముద్దు సన్నివేశాల్లో నటించడం చూసి తన తల్లిదండ్రులు షాకయ్యారట. దీంతో ఆమె తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారట. అలాంటి సన్నివేశాల్లో నటించకూడదని కండిషన్స్ పెట్టారట. అయితే ఆ కండిషన్స్ కారణంగా తాను ఎన్నో అవకాశాలు కోల్పోయానని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది మృణాల్. ఆ తర్వాత తన తల్లిదండ్రులను ఒప్పించి సినిమాల్లో ముద్దు సన్నివేశాల్లో నటించిందట.

## ఆసుపత్రిలో చేరిన కియారా అద్వానీ.?



మూవీ డెస్క్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): బాలీవుడ్ నటి కియారా అద్వానీ అనారోగ్యం కారణంగా ముంబైలోని ఆసుపత్రిలో చేరినట్లు ఉదయం నుంచి వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను ఆమె ప్రతినిధి ఖండించారు. కియారా అద్వానీ ఏ ఆసుపత్రిలో చేరలేదని.. ఆమె ఆరోగ్యంగానే ఉందని బిజీ షెడ్యూల్ కారణంగా విశ్రాంతి తీసుకోవాలని అనుకుందని అంతే తప్ప సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు ఫేక్ అని తెలిపారు. కియారా అద్వానీ నటిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. రామ్ చరణ్ కథానాయకుడిగా.. నటిస్తున్న ఈ సినిమాకు శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు 3 ఏండ్లకు పైగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది కియారా. రీసెంట్‌గా ఆరోగ్యం బాలేక గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఈవెంట్‌కి కూడా రాలేదు ఈ అమ్మడు. ముంబై ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న ఈ అమ్మడు ప్రస్తుతం విశ్రాంతి తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, నాజర్, ప్రకాష్ రాజ్, సునీల్, జయరామ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ‘దళపతి 69’ సినిమా ‘భగవంత్ కేసరి’ రీమేక్ కాదు..






మూవీ డెస్క్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): గతేడాది గోట్ ‘ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్’ సినిమాతో హిట్ అందుకున్న తమిళ అగ్ర నటుడు దళపతి విజయ్ ప్రస్తుతం హెచ్. వినోద్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. దళపతి 69 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో పూజ హెగ్డే కథానాయికగా నటిస్తుండగా.. ప్రేమలు బ్యూటీ మమితా బైజు కీలక పాత్రలో నటించబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా ఒక వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే.టాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమాను దళపతి 69గా రీమేక్ చేస్తున్నట్లు.. ఇప్పటికే దీనికి సంబంధించిన తమిళం హక్కులను కూడా మేకర్స్ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ వార్తలపై దర్శకుడు హెచ్.వినోద్ క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా భగవంత్ కేసరి రీమేక్ కాదని.. ఇది ఒక ఒరిజినల్ కథ అని.. విజయ్‌కి ఈ చిత్రం పక్కా మాస్ కమర్షియల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ అవుతుందని తెలిపాడు.

ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

## ‘ఆర్‌సీ16’ సెట్స్‌లో జాయిన్ అయిన మున్నాభయ్యా.!



మూవీడెస్క్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా అనంతరం రామ్ చరణ్ ‘ఉప్పెన’ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఆర్‌సీ16 అనే సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. మైసూర్‌లో రామ్ చరణ్‌పై కీలకమైన సన్నివేశాలు తెరకెక్కించారు మేకర్స్. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు ‘మీర్జాపూర్’ వెబ్ సిరీస్‌లో మున్నాభాయ్యగా నటించిన దివ్యేందు శర్మ నటిస్తున్నట్లు చిత్రబృందం ఇంతకుముందే ప్రకటించింది. ఇదిలావుంటే తాజాగా ఆర్‌సీ16 షూటింగ్ సెట్స్‌లో మున్నాభాయ్య జాయిన్ అయినట్లు తెలుస్తుంది. షూటింగ్ సెట్స్‌లో దివ్యేందు శర్మతో బుచ్చిబాబు దిగిన ఫొటోలను చిత్రబృందం తాజాగా పంచుకుంది. ఇందులో కమెడియన్ నవీన్ కూడా ఉన్నాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లో కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తుండగా..జాన్వీ కపూర్ కథానాయికగా చేస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు.

## ఎటెళ్లాలో అర్థంకాక..?



మూవీ డెస్క్,04 జనవరి (క్రాంతి న్యూస్ ): కథానాయిక రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి శాండిల్‌వుడ్‌లో బాగా హల్‌చల్ చేస్తున్నది. వివరాల్లో కెళ్తే.. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన అగ్రిమెంట్‌లో సంతకం చేసింది. తమ సినిమా పూర్తయ్యేంతవరకు మరో సినిమా చేయకూడదని ఒప్పందం సారాంశం. ఇదిలావుంటే.. దీనికంటే ముందే ‘కాంతార-2’కు కూడా సైన్ చేసింది. ఈ సినిమా అయ్యేంతవరకూ మరో సినిమా చేయకూడదని రిషబ్‌శెట్టి ఒప్పందం. దానిక్కూడా ఓకే అనేసి, అడ్వాన్స్ అందుకుంది. ఈ రెండు సినిమాలకే కాక, చిన్నాచితకా సినిమాలక్కూడా ఓకే చెప్పిందట. ఈ సినిమాలన్నీ ఈ ఏడాదే షూటింగ్స్ జరుపుకోనున్నాయి. దాంతో తీసుకున్న డబ్బుల్ని వెనక్కి ఇవ్వలేక, ఎటెళ్లాలో అర్థం కాక, బోనులో చిక్కుకున్న ఎలుకలా ఉక్కిరిబిక్కిరి అవుతున్నదట ఈ అందాల భామ. ఓ ప్లానింగ్ లేకుండా అగ్రిమెంట్లపై సంతకాలు చేసినందుకు అటు ప్రశాంత్‌నీల్, ఇటు రిషబ్‌శెట్టి ఈ ముద్దుగుమ్మపై కోపంగా ఉన్నారట. మరి ఈ సమస్యల నుంచి రుక్మిణి ఎలా బయటపడుతుందో చూడాలి. ప్రస్తుతం ఈ వార్త కర్ణాటక సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com